నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
25 అక్టోబర్ 2023
పేజీలు 8

**తపాలా దినోత్సవం**

ప్రపంచ తపాలా దినోత్సవం (వరల్డ్ పోస్ట్ డే)ను అక్టోబర్ 9న నిర్వహించారు. స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ)ను స్థాపించారు. దీనికి గుర్తుగా ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మొదటిసారిగా 1969లో టోక్యోలో జరిగిన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ సమావేశంలో ఈ దినోత్సవాన్ని ప్రకటించారు. ఈ ఏడాది దీని థీమ్ 'టుగెదర్ ఫర్ ట్రస్ట్: కొలాబరేటింగ్ ఫర్ ఏ సేఫ్ అండ్ కనెక్టెడ్ ఫ్యూచర్'.

# అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారతదేశ వాటా ఎంత?

1. **పేదరిక నిర్మూలన రోజు ఎప్పుడు నిర్వహిస్తారు? (4)**
   1) అక్టోబర్ 14    2) అక్టోబర్ 15
   3) అక్టోబర్ 16    4) అక్టోబర్ 17

**వివరణ:** పేదరిక నిర్మూలన రోజుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 17న నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ రోజు ఇతివృత్తం 'సముచిత పని సామాజిక భద్రత, ప్రతి ఒక్కరి శ్రమలో హుందాతనాన్ని తీసుకురావడం'. పేదరిక రేఖకు దిగువన ఉన్న వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేసే లక్ష్యంతో ఈ రోజును ఎంపిక చేశారు.

**అక్టోబర్ 14:** ప్రపంచ ప్రమాణాల రోజు (వరల్డ్ స్టాండర్డ్స్ డే)

**అక్టోబర్ 15:** ప్రపంచ విద్యార్థుల రోజు (అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా), గ్రామీణ మహిళల అంతర్జాతీయ రోజు

**అక్టోబర్ 16:** ప్రపంచ ఆహార దినోత్సవం, ప్రపంచ అనస్థీషియా రోజు

2. **అరిందం బాగ్చి ఇటీవల వార్తల్లో నిలిచారు. ఎందుకు? (2)**
   1) న్యూయార్క్‌లోని యూఎన్ కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధిగా నియామకం
   2) జెనీవాలోని యూఎన్ కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధిగా నియామకం
   3) ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత శాశ్వత ప్రతినిధిగా నియామకం
   4) జీ-20 సమన్వయకుడిగా నియామకం

**వివరణ:** జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో భారత శాశ్వత ప్రతినిధిగా అరిందం బాగ్చి నియమితులయ్యారు. ఇంద్రమణి పాండే స్థానంలో ఈ ఎంపిక జరిగింది. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రస్తుతం భారత శాశ్వత రాయబారిగా రుచిరా కాంబోజ్ ఉన్నారు. ఈ పదవిని చేపట్టిన తొలి మహిళ ఆమె. ఆమె గతంలో యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధిగా కూడా విధులు నిర్వహించారు. అలాగే జెనీవాలోని ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత్ తరపున శాశ్వత రాయబారిగా బ్రజేంద్ర నవ్‌నీత్ ఉన్నారు. ఇటీవల ఆయన పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. జీ-20 సమన్వయకుడిగా ప్రస్తుతం హర్షవర్ధన్ శ్రింగ్లా ఉన్నారు.

3. **జీఐటీఈఎక్స్ గ్లోబల్-2023 ని ఎక్కడ నిర్వహించారు? (3)**
   1) ఇండోనేషియా    2) మలేషియా    3) యూఏఈ    4) సౌదీ అరేబియా

**వివరణ:** సాంకేతిక రంగంలో ఎంతో పేరున్న జీటెక్స్ (జీఐటీఈఎక్స్) గ్లోబల్‌ను యూఏఈలోని దుబాయ్‌లో నిర్వహించారు. ఈ ఏడాది ఇది 43వ సమావేశం. అక్టోబర్ 16న ప్రారంభమైన ఈ వేడుక అక్టోబర్ 20 వరకు కొనసాగింది. కృత్రిమ మేధతో పాటు ఫిన్‌టెక్, బ్లాక్ చెయిన్ తదితర అంశాలు ఇందులో చర్చించారు.

**మలేషియా:** హెచ్‌ఏఎల్ తన తొలి విదేశీ శాఖను ఈ ఏడాది మలేషియాలోని కౌలాలంపూర్‌లో ప్రారంభించింది.

**ఇండోనేషియా:** జస్ట్ ఎనర్జీ ట్రాన్సిషన్ పార్ట్‌నర్‌షిప్‌లో సంతకం చేసిన రెండో దేశం.

**సౌదీ అరేబియా:** రయాన బర్నవి, అరబ్ దేశాలకు సంబంధించి తొలి మహిళా వ్యోమగామి.



4. **కింది ఏ దేశంతో 2+2 చర్చలను అక్టోబర్ 16న భారత్ న్యూఢిల్లీలో నిర్వహించింది? (4)**
   1) అమెరికా    2) జపాన్
   3) రష్యా    4) యూకే

**వివరణ:** అక్టోబర్ 16న యూకేతో భారత్ 2+2 చర్చలను ప్రారంభించింది. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలను చర్చించారు.

2+2 విధానం అంటే?- భారత రక్షణ, విదేశాంగ శాఖ మంత్రి ఇతర దేశాల రక్షణ విదేశాంగ శాఖ మంత్రులతో చర్చించడాన్ని 2+2 విధానం అంటారు. భారత్‌కు ఈ తరహా చర్చలు యూఎస్, జపాన్, ఆస్ట్రేలియా, రష్యా దేశాలతో ఉండేవి. తాజాగా యూకేతో కూడా ప్రారంభించింది. భారత్‌కు తొలి 2+2 భాగస్వామి అమెరికా కాగా, తాజాగా ఈ తరహా విధానాన్ని యూకేతో కూడా ప్రారంభించారు. భారత్-యూకే రోడ్ మ్యాప్ 2030 అనే అంశంపై చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇటీవల కాలంలో జరుగుతున్న మార్పులు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం పై కూడా ఇరు పక్షాలు చర్చించాయి.

5. **'సైక్' అనే పదం దేనికి సంబంధించింది? (1)**
   1) స్పేస్‌క్రాఫ్ట్    2) కొత్త రకం వైరస్
   3) కృత్రిమ మేధ
   4) మానసిక పరివర్తన రోబో

**వివరణ:** సైక్ పేరుతో నాసా ఒక స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగించింది. ఈ మిషన్ కాలం ఆరు సంవత్సరాలు. నిజానికి సైక్ అనేది ఒక గ్రహ శకలం. ఎక్కువగా లోహాలు దీనిలో ఉన్నట్లు భావిస్తున్నారు. దీని పేరు కూడా సైక్. ఇది అంగారక, బృహస్పతి మధ్య సంచరిస్తూ ఉంటుంది. దీని ప్రథమ లక్ష్యం ముడి ఇనుమును గుర్తించడం. అంతరిక్షంలో ఒక వ్యవస్థ రాళ్లు, మంచుతో కాకుండా, ఇనుముతో ఎలా రూపొందింది అనే అంశంపై కూడా ఇది పరిశోధన చేయనుంది.

6. **ఏ అంశానికి సంబంధించి ఆస్ట్రేలియాలో ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు? (3)**
   1) గణతంత్రం కావడానికి
   2) కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు
   3) స్థానిక గిరిజనులకు గుర్తింపునకు
   4) పైవేవీ కావు

**వివరణ:** స్థానిక గిరిజనులకు రాజ్యాంగంలో స్థానం కల్పించాలన్న అంశంపై ఆస్ట్రేలియా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. సానుకూలంగా వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని సవరించే వాళ్లు. అయితే గిరిజనులకు స్థానం కల్పించే అంశానికి సంబంధించి ఆస్ట్రేలియన్ ఓటర్లు సానుకూలంగా ఓటు వేయలేదు. ఆ దేశంలో అబోరిజినిల్, టొర్రెస్ సంధిలో గిరిజనులు ఉంటారు. వీరి జనాభా 26 మిలియన్లు. మొత్తం దేశ జనాభాలో 3.8% ఉన్నారు. వీరికి సంబంధించిన ప్రస్తావన రాజ్యాంగంలో ఎక్కడా లేదు. 1999లో ఆస్ట్రేలియాలో రెఫరెండం నిర్వహించారు. గణతంత్ర దేశంగా అవతరించేందుకు సంబంధించింది. అలాగే 2026లో కామన్వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలో నిర్వహించాల్సి ఉన్నా, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విరమించుకుంది.

7. **ప్రస్తుతం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారతదేశ వాటా ఎంత? (2)**
   1) 3%   2) 2%   3) 8%   4) 9%

**వివరణ:** అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం భారత్ వాటా 2% మాత్రమే. 2033 నాటికి దీన్ని 8 శాతానికి పెంచాలని ఇటీవల చేసిన దార్శనిక పత్రంలో పేర్కొన్నారు. ఇందులో పేర్కొన్న ఇతర లక్ష్యాలు

1. స్థానిక అంతరిక్ష మార్కెట్ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్లు ఉండగా, దీన్ని 33 బిలియన్ డాలర్లకు పెంచాలి. అలాగే మొత్తం ఎగుమతుల్లో అంతరిక్ష రంగం వాటా ప్రస్తుతం 0.3 బిలియన్ డాలర్లు ఉండగా, దాన్ని 33 బిలియన్ డాలర్లకు పెంచాలి.
2. ప్రైవేట్ రంగం పాత్రను పెంచాలి.
3. రానున్న పదేళ్లలో రూ.17,600 కోట్ల పెట్టుబడులను ఆకట్టుకోవాలి.

8. **గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్‌ను ఏ నగరంలో నిర్వహించారు? (4)**
   1) సూరత్    2) విశాఖపట్నం
   3) చెన్నై    4) ముంబయి

**వివరణ:** మారిటైం సమావేశం అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో నిర్వహించారు. నౌకా యానానికి సంబంధించి భారత దేశంలో నిర్వహించిన అతిపెద్ద సమావేశం ఇదే. వర్చువల్ పద్ధతిలో దీన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో మొత్తం 12 దేశాలు పాల్గొన్నాయి. అవి.. అర్మేనియా, బంగ్లాదేశ్, బెలారస్, కొమొరోస్, ఇరాన్, ఇటలీ, శ్రీలంక, టాంజానియా, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్, స్పెయిన్, నేపాల్. భారత్‌లోని పదహారు రాష్ట్రాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. నౌకాయానాన్ని కార్బన్ రహితంగా మార్చడం, నౌకా నిర్మాణంలో సృజనాత్మకత, భద్రత, నౌకాయాన పర్యాటకంపై చర్చించారు.

9. **దేశంలోని ఏ రాష్ట్రంలో తొలిసారిగా మహిళా పోలీస్ స్టేషన్‌కు ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికేషన్ దక్కింది? (3)**
   1) గుజరాత్    2) కేరళ
   3) మధ్యప్రదేశ్    4) మణిపూర్

**వివరణ:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని మహిళా పోలీస్ స్టేషన్ ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికేషన్ పొందింది. మూడు సంవత్సరాలకు ఇది అమల్లో ఉంటుంది. ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఈ తరహా సర్టిఫికెట్ పొందడం భారత్‌లో ఇదే ప్రథమం.

10. **2028లో ఒలింపిక్స్ క్రీడలు ఏ నగరంలో జరుగనున్నాయి? (4)**
    1) ముంబయి    2) పారిస్
    3) బ్రిస్బేన్    4) లాస్ ఏంజిల్స్

**వివరణ:** 2028లో ఒలింపిక్స్ క్రీడలు అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో నిర్వహించనున్నారు. 2024లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఈ క్రీడా వేడుకలు జరుగనుండగా, 2032లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఉంటాయి. ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ కమిటీ సమావేశం ముంబయిలో అక్టోబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించారు. 2028లో నిర్వహించబోయే ఒలింపిక్స్‌లో కొత్త క్రీడలను చేర్చారు. అవి.. బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, క్రికెట్ (టీ-20), ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్సే, స్క్వాష్. అయితే ఫ్లాగ్ ఫుట్‌బాల్, స్క్వాష్ తొలిసారిగా ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టగా, బేస్‌బాల్, క్రికెట్, లాక్రోస్సేలను పునఃప్రవేశపెడుతున్నారు. భారత్‌లో గతంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సమావేశం 1983లో నిర్వహించారు.

11. **నీటి ఘనపరిమాణం, వెడల్పు అంశాల రీత్యా ప్రపంచంలో అతిపెద్ద నది ఏది? (2)**
    1) నైల్    2) అమెజాన్
    3) వోల్గా    4) యాంగ్జీ నది

**వివరణ:** నీటి ఘనపరిమాణం, వెడల్పు అంశాల ప్రాతిపదికన ప్రపంచంలోనే అతిపెద్ద నది అమెజాన్. గడిచిన 100 సంవత్సరాల్లో ఈ ఏడాది అతి తక్కువ స్థాయిలో దీని ప్రవాహం నమోదయ్యింది. మారుతున్న పర్యావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ పరిస్థితి సంభవించింది. నైల్ నది ఆఫ్రికా ఖండంలోనిది. ఇది ప్రపంచంలోనే అత్యంత పొడవైంది. అలాగే యూరప్ ఖండంలో అత్యంత పొడవైంది వోల్గా నది. ఆసియా ఖండంలో అత్యంత పొడవైంది యాంగ్జీ నది.

12. **దేశంలోని ఏ నగరం మెరుగు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంక్ 181 మిలియన్ డాలర్లు ఇవ్వనుంది? (3)**
    1) సూరత్    2) భోపాల్
    3) అహ్మదాబాద్    4) ఇండోర్

**వివరణ:** అహ్మదాబాద్ పట్టణంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు 181 మిలియన్ డాలర్లను ఆసియా అభివృద్ధి బ్యాంక్ ఇవ్వనుంది. ఫిలిప్పీన్స్‌లోని మనీలా కేంద్రంగా ఈ బ్యాంక్ పనిచేస్తుంది. అహ్మదాబాద్‌లో జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఈ మొత్తాన్ని వ్యయం చేయనున్నారు.

**సూరత్:** గుజరాత్ రాష్ట్రంలో ఉంది. దేశంలో తొలి స్టీల్ స్లాగ్ రోడ్ వచ్చింది ఇక్కడే. అలాగే దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను ఇక్కడ తీసుకువస్తున్నారు.

**భోపాల్:** సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుసంధానం అయిన భారత తొలి నగరం భోపాల్.

**ఇండోర్:** దేశంలో హరిత బాండ్లు విడుదల చేసిన తొలి మున్సిపాలిటీ ఇండోర్.

13. **హైతీలో ఘర్షణల నియంత్రణకు ఏ దేశం నేతృత్వంలో మిషన్ వెళ్లనుంది? (2)**
    1) అమెరికా    2) కెన్యా
    3) రష్యా    4) దక్షిణాఫ్రికా

**వివరణ:** హైతీలో తీవ్ర స్థాయిలో ఉన్న ఘర్షణలను నియంత్రించేందుకు కెన్యా నేతృత్వంలో ఒక మిషన్ వెళ్లనుంది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. ఆ దేశంలో గతేడాది ప్రారంభమైన ఘర్షణలు నేటికీ కొనసాగుతున్నాయి. అక్టోబర్ 2022 నుంచి జూన్ 2023 వరకు ఘర్షణల వల్ల 2800 మంది ప్రజలు మరణించారు. ఇందులో 80 మంది చిన్నారులు కూడా ఉన్నారు.

14. **రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిమను ఏ దేశంలో ఆవిష్కరించారు? (4)**
    1) జపాన్    2) పరాగ్వే    3) అమెరికా    4) వియత్నాం

**వివరణ:** నోబెల్ బహుమతి పొందిన తొలి యూరపేతర వాసి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిమను వియత్నాంలో ఆవిష్కరించారు. భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ దీనికి హాజరయ్యారు. ఆ దేశంలోని బక్‌నిన్హ్ నగరంలో ఈ ప్రతిమను ఏర్పాటు చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ 1929లో ఆ దేశంలో మూడు రోజులు పర్యటించారు. 1982లో ఆయన చిత్రంతో ఆ దేశంలో ఒక స్టాంప్‌ను కూడా విడుదల చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నోబెల్ బహుమతి తెచ్చిన గీతాంజలి పుస్తకాన్ని 2001లో వియత్నాం భాషలోకి అనువదించారు. ఇది అక్కడ ఎంతో ప్రజాదరణ పొందింది.

**జపాన్:** మహాత్మాగాంధీ ప్రతిమను ఈ దేశంలో ఆవిష్కరించారు. అలాగే ఆయన ప్రతిమ పరాగ్వే దేశంలో కూడా ఉంది.

**అమెరికా:** గతేడాది డిసెంబర్ 14న గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే భారత్ వెలుపల అత్యంత ఎత్తయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అమెరికాలో అక్టోబర్ 14న ఆవిష్కరించారు.



15. **ఏ సంవత్సరంలో చంద్రుడిపైకి భారత తొలి వ్యోమగామిని పంపాలని భారత ప్రధాన మంత్రి దిశా నిర్దేశం చేశారు? (3)**
    1) 2030    2) 2035
    3) 2040    4) 2045

**వివరణ:** భారతదేశ అంతరిక్ష కార్యకలాపాల విస్తరణకు సంబంధించి ప్రణాళికలపై ప్రధాని నరేంద్ర మోదీ దిశా నిర్దేశం చేశారు. చంద్రుడిపైకి తొలి వ్యోమగామి 2040 నాటికి సన్నద్ధం కావాలని సూచించారు. అలాగే స్పేస్ స్టేషన్‌ను 2035 నాటికి ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయాలని సూచించారు. నిజానికి 2022 నాటికే భారత్ స్పేస్ స్టేషన్‌ను అందుబాటులోకి తేవాల్సి ఉంది. సాంకేతిక సమస్యలతో పాటు, కొవిడ్-19 మూలంగా వాయిదా పడింది. 2025 నాటికి గగన్‌యాన్‌ను భారత్ తలపెట్టింది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

